

# అగ్రహారం కథలు
## వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదురుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

# రామనవమీ - రికార్డింగ్ డాన్సులూ

**చైత్రమాసం వచ్చిందంటే** అగ్రహారంలో చెప్పలేనంత సందడి. ముందేమో ఉగాది, దానివెనుకే ఊరి వేలుపైన శ్రీ రామచంద్రుడు పుట్టినదీ, పెళ్ళాడినదీ అయిన నవమీనూ. అందుకే పాడ్యమి మొదలు ఊరంతా కళకళలాడిపోతుంది. వసంత నవరాత్రులూ, సీతారాముల కల్యాణాలూ వీటితో. సీతాలక్ష్మణసమేతంగా హనుమంతుడి సాక్షిగా కొలువున్నాడు కనుక అగ్రహారం రామయ్య పుట్టిన ఊరు అయోధ్య కిందే లెక్క, అదీ కాక రెండిటిదీ ఉన్న ఆద్యక్షర సారూప్యం కూడా కలిసింది కదా. అగ్రహారమూ, అయోధ్యా రెండూ 'అ' తోనే మొదలు అవుతాయి కనక.

నవమికి దాదాపు నెలరోజుల ముందుగానే ఊరిపెద్దలు చర్చలకు దిగుతారు. పప్పువారింటిలోనో, కరణంగారి అరుగుమీదో చేరి ఆ పది రోజులూ ఏమి చేస్తే బాగుంటుందో, ఎవరు ఈ సంవత్సరం పీటలమీద కూర్చుని కల్యాణం జరిపిస్తే బాగుంటుందో అనుకుంటారు. తరవాత నవమి నాటి భోజనాల సంగతీ, ప్రసాదాలూ.. తదుపరి నవరాత్రుల కార్యక్రమాలు. ఇలా సాగుతాయి వాళ్ళ చర్చలు. చర్చించేవారు పెద్దవారు కనక వారి ఆలోచనలు కూడా అలాగే ఉంటాయి. హరికథలూ, బుర్రకథలూ, భజనా, పురాణకాలక్షేపం ఇలాంటివి. వీటిల్లో సినిమాలూ, నాటకాలు ఇలాంటివాటికి తావుండదు. ఇది ఊరిలో కుర్రాళ్ళగుంపుకి పెద్దగా నచ్చేది కాదు. కానీ పెద్దలనేమీ అనలేక చెయ్యడానికేమీ చేతకాక ఊరుకునేవారు.

సంవత్సారాది పాడ్యమి వెళ్ళిన విదియనాటినించే హడావుడి. ప్రతీసారీ లాగానే ఈ ఏడాదీ ప్రారంభం అయింది. గుడినించి రోడ్డు వరకూ ఉన్న మొగ అంతా శుభ్రం చేసారు. రోడ్డునించీ గుడి దాకా పెద్ద పందిరి వేసారు. గుడి ముందు మరో చిన్న పందిరి. గుడికి వెల్ల వేసి, ఆవరణంతా కడిగేసి, నావసుద్ద తడిపి, ముగ్గులు తీర్చి దిద్దారు. గుడిపక్కనే గోదావరిలోకి ఉన్న మెట్లూ, పడీ పాకుడు లేకుండా చక్కగా కడిగేసి అక్కడ కూడా ముగ్గులు వేసారు. పందిరంతా తోరణాలు, పేన్నీళ్ళు చల్లారు. పచ్చని ఆకులు, వెచ్చని కల్లాపి నీళ్ళూ కలిసిన చిత్రమైన వాసన.

దేవుడి సామాన్లు అన్నీ ధర్మకర్తగారింటినించీ తీసి చింతపండు, వెలిబూడిద వేసి తోమేసి తళతళలాడించేసారు. గుడి ఆవరణలో ఓ మూల గాడిపొయ్యి వెయ్యడానికి అనువైన మూల చూసి, దేవుడినిప్రార్థించి పొయ్యి తవ్వేసి, ముగ్గు వేసి ఉంచారు. పక్కనే చిన్న రేకుల షెడ్డులో తోమిన గుండిగెలూ, గంగాళాలూ, గోకర్ణాలూ, నేతిజారీలు అన్నీ సర్ది పెట్టారు. ఊరందరింట్లోనూ పెళ్ళి జరుగుతున్నట్టే ఉంటుంది ఆ వేడుక. ప్రతీ ఇంటికీ ఒక పని.. కూరలు తేవడం, పాలు తేవడం, పానకాలు వడపప్పూ ఇలా ఒకటేమిటి ఎంత సందడో, ఆ వేడుక చూడవలసినదే కానీ చెప్పడం కష్టం.

రేపు నవమి అనగానే అందరూ ఇళ్ళ బూజులు దులిపేసి, కడిగేసుకున్నారు. అయోధ్యలో మాత్రం అలాగే కదా చేసారు. ఎంత ఆడపిల్లవారింట్లో పెళ్ళి జరిగితే మాత్రం? మన ఊరి పిల్లాడిది కదా పెళ్ళి. మన ఇళ్ళూ వాకిళ్ళూ మాత్రం కళగా ఉండద్దూ? అనుకున్నారుట అయోధ్యా వాసులు, అచ్చం మన అగ్రహారపు వారిలాగే.

అంతేకాదు పాపం మండుటెండాకాలంలో పెళ్ళాయే. రామయ్యేమో ఆజానుబాహుడూ, అరవిందలోచనుడూ అయినా సరే మరి సుకుమారుడు, సుందరాకారుడూనూ. ఇక జానకమ్మేమో పాపం ఎండ కన్నెరుగని లలనామణి. ఊరేగింపులో ఎండ వేడి మాట అటుంచితే, ఊరివాళ్ళ దృష్టి తీక్షణతకే అలిసిపోతే, ఎవరింటిలోనైనా దాహమడిగితే అది తీర్చేభాగ్యం కలగడమే అదృష్టం కదా.! అందుకే చక్కని పానకాలు, చల్లని మజ్జిగతేటలూ తయారు చేసుకుని ఉన్నారుట అమ్మలక్కలు.

మన అగ్రహారపు రాముడూ ఊరేగుతాడు కదా మరి, పెళ్ళిముందూ, అయ్యాకా కూడానూ. అందుకే ఘుమఘుమలాడే ఏలకుపొడీ, మిరియాలపొడీ కలిపిన చల్లటి పానకం తయారు చేసి ఉంచారు. దానికితోడు నానవేసిన వడపప్పూ, ఉడికించి పోపు వేసిన శనగలూనూ. దేవుడంతటి రాముడొస్తే ఊరికే చల్లటి నీళ్ళిచ్చిపంపుతారా ఎవరైనా?

చైత్రమాసపు ఎండ చిరచిరలాడుతోంది. నవమినాడు తెల్లారుతూనే జోడు సన్నాయి మేళంతో ఊరంతా రోజాకంటే ముందే నిద్ర లేచింది. తమ ఇళ్ళల్లో పూజలూ, నైవేద్యాలూ క్లుప్తంగా కానిచ్చేసుకుని అందరూ గుడివైపే పరుగులు. పట్టుచీరలూ, పరికిణీల గరగరలూ, చేమంతీ, మల్లెల ఘుమఘుమలూ.. కాలి మువ్వల గలగలలూ.. వెండిమెట్టెల సవ్వళ్ళూ, పట్టుపంచెలూ, ఉత్తరీయాల రెపరెపలూ అన్నీ దేవుడి గుడివైపే. పందిరంతా పెద్ద పెద్ద బరకాలు పరిచారు. అందరికీ తాటాకు విసనకర్రలిచ్చారు.

కరణంగారూ, భార్యా కూర్చుని, ఆదిలక్ష్మిని కన్యాదానమిచ్చీ, ఆది దేవుడికి కాళ్ళు కడిగీ, జనకమహారాజ దంపతులు పొందిన అదృష్టాన్ని పొందారు. కన్యావర్ణాలతో, వివాహ మంత్రాలతో, వేదఘోషలతో భద్రాచలంలో కల్యాణాన్ని తలపించేలా రంగరంగ వైభవంగా జరిగింది ఏటేటా జరిగినా, ప్రతీ ఏడూ సరికొత్తగా అనిపించే ఊరందరి వేడుక.

ధర్మకర్తగారు పద్రిగాముల ముత్యాల్ని కలిపారు మల్లెలూ, పొన్నలూ కలిసిన సువాసనలీనుతున్న తలంబ్రాల బియ్యంలో. సినిమా పాటేఅయినా నిజమైన పెళ్ళిపాటలా జనస్రవంతిలో కలిసిపోయి, దేవుడి పెళ్ళికోసమే పుట్టినట్టుగా వినిపించే 'శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారండీ' అనే పాట ఊరందరూ పాడేసారు ఏకకంఠంతో. ప్రతీ ఏడాది తాము చేసేదే అయినా ఏదో తెలీని ఆనందంతో చెమరించిన కన్నులతో తతంగాన్నంతా మనసారా చూశారు, కళ్ళు అలవికాని ఆనందంతో మసకలేస్తే మనసేగా చూసేది మరి.

పెళ్ళీ, పూజా అయినతరవాత అందరికీ రత్నా ఐస్ ఫాక్టరీ నించీ ప్రత్యేకంగా తెప్పించిన ఐస్ వేసి పానకం పంచారు. అప్పటికే వంట ఏర్పాట్లు పూర్తి అయిపోయాయి. ఆడవాళ్ళు వంటబ్రాహ్మలకి తగిన సహాయం చేస్తుంటే చకచకా వంట పూర్తి అయిపోయింది. నాలుగు బంతులలో మృష్టాన్నభోజనాలు కానిచ్చేసి ఆవరణంతా శుభ్రం చేసేసరికి మూడు కొట్టింది గడియారం.

"సాయంత్రం హరికథనుకున్నాం కదా!, ఐదుకల్లా, వస్తారు దీక్షితులుగారు మా ఇంట్లో దింపుకుంటానులెండి " అన్నారు తాసిల్దారుగారు.

"ఏడుగంటలకల్లా ప్రారంభిస్తే ఆయన పూర్తిచేసేసరికి తొమ్మిది దాటవచ్చు.. రాత్రికి దాసుగారికి మా ఇంట్లోనే బస. ఆయన ఈ మధ్య రేడియోలలో కూడా చెపుతున్నారు, చాలా బాగా చెపుతారు" అన్నారు.

దీక్షితులుగారు పక్కనే ఉన్న సాకూరు గర్వు వాసులు.. ఘంటసాల మాస్టారిలాంటి కంచుకంఠంతోటీ, రేలంగి వారిలాంటి సహజచతురతోటీ 'శ్రీ నగజా తనయం' లాంటిదే సీతా కల్యాణ సత్కధని పాలూ మిరియాలూ అడగకుండానే తనదైన సహజ శైలిలో చక్కగా రక్తి కట్టిస్తూ చెప్పారు. ఆయన చెపుతున్నంతసేపూ ఊరిప్రజలందరూ పొద్దున్న తాము జరిపిన కల్యాణాన్నీ, సీతారాముల కల్యాణానికి ముందూ, వెనకా జరిగిన సంగతులనీ గుర్తు చేసుకుని ఆనందించారు.

పట్టుపంచెలూ, చీరల మధ్యనింకో గుంపుని గురించి ఇందాకే అనుకున్నాం కదా. వారే ఈ మధ్యనే నిక్కర్లనించీ పంట్లాముల్లోకి మారిన అగ్రహారపు కుర్రాళ్ళు. ఊరిలో ఏ పని తలపెట్టినా అన్నిటికీ ముందుంటారు వీళ్ళే. వీళ్ళందరికీ కరణంగారి అబ్బాయి బాబ్జీ నాయకుడు. పదిరోజులనించీ మిత్రబృందమంతా తలమునకలయ్యే పనులలో ఉన్నారు. పందిళ్ళేయించడం దగ్గరనించీ పానకాలు పంచేదాకా ఒకటే పని.. పెద్దవాళ్ళు దేవుడి పెళ్ళికి చేసే పనులన్నీ వీరికిష్టమే అయినా రాత్రి ప్రోగ్రాములకొచ్చేసరికి మాత్రం వాళ్ళకి పెద్దగా నచ్చేది కాదు. ఐతే పెద్దలమీదనున్న గౌరవం వల్లనైతేనేం, భయంవల్లనైతేనేం ఎప్పుడూ చెప్పలేదు వాళ్ళతో కిందటేడాదివరకూ.

"ఎప్పుడూ హరికథలూ, బుర్రకథలేనా నాన్నా? సరదాగా ఇంకేదైనా పెట్టిద్దామా? "అని అడిగాడు క్రిందటేడాది. తండ్రిని ధైర్యం చేసి.

"ఇంకేం ఉంటాయిరా పెట్టడానికి?. పక్కఊరిలో పద్మరాజు అని అతను ఏకపాత్రాభినయాలు బాగా చేస్తాడుట, రావణాసురుడు, ధుర్యోధనుడూ అలాంటివి. పోనీ అతనికి కబురు పెడదామా? " అన్నారాయన పచ్చట్లో నూనె వేసుకుంటూ.

తండ్రి చూడకుండా తలబాదుకున్నాడు బాబ్జీ.

"అది కాదు నాన్నా! మా కాలేజీలో పిల్లలు చెప్పారు, వాళ్ళ ఊరిలో చిన్న తెర పెట్టి సినిమాలు చూపించారుట కిందటిసారి. పిల్లలూ, పెద్దలూ అందరికీ చాలా నచ్చిందిట".

'అమ్మా నువ్వు చెప్పవే!' అన్నట్టు అమ్మకేసి చూసాడు. ఆవిడ వెంటనే అందుకుని. "పోనీ ఓసారి చూడరాదుటండీ, సినిమాలు ఎలా ఉంటాయో? " అని వత్తాసు పలికింది. "మంచిదీ, మీకిష్టమైనదే పెడితే సరి! " అంది..

బాబ్జీ అవునన్నట్టు చూసాడు తండ్రివంక...

సినిమాలూ నాటకాలూ పిల్లల్ని చెడగొడతాయనేది ఆయన నమ్మకం.. బాబ్జీ చెయ్యి కడుక్కోవడానికి వెళ్ళినప్పుడో ఉభయతారకమైన సలహా చెప్పింది.

"చక్కగా దేవుడి సినిమా పట్టమ్మని చెప్పండి" అంటూ.

మూడోనాడు చిన్నతెరా, భక్తప్రహ్లాద సినిమా దిగాయి. బాబ్జీ, స్నేహితులూ తెల్లబోయారు. కానీ పిల్లలూ, పెద్దలూ చాలా - ఆనందించారు. 'జీవము నీవే కదా' అంటూనూ, 'నారాయణ మంత్రం' అంటూనూ పాడుకుంటూ పరవశించిపోయారు. కుర్రాళ్ళు

మాత్రం 'ఇంతకంటే మించి మరే సినిమా దొరకలేదా వీళ్ళకి? ' అనుకుని నీరసపడ్డారు. 'ఈ సారి ఎలాగైనా ఏదైనా కొత్తగా పెట్టించాలి 'అనుకున్నారు.

అప్పుడే పట్టుకొచ్చాడు శివుడు ఆ కబురు "ఒరే మన బాచిగాడి ఊరిలో రికార్డింగ్ డాన్స్ పెట్టారుట, ఒకటి కాదు, మూడు రోజులు. అదరగొట్టేస్తున్నారుట! జనం పక్క ఊర్లనించీ బళ్ళు కట్టుకుని మరీ వచ్చారుట. జూనియర్ ఎన్.టీ.ఆర్, నాగేశ్వరరావు అదిరిపోయారు సరే, హీరోయిన్ పేరు నాగదేవిట. 'నీవు లేక వీణా' పాడితే సావిత్రిలాగానూ, 'కొంటె చూపు ' పాడితే వాణిశ్రీ లాగే ఉంటుందిట. ఒకటే చెప్పేసి నన్ను ఊదరగొట్టేసాడొరే బాబ్జీ, ఎలాగైనా మనం వాళ్ళనీసారి తీసుకురావాలిరా బాబూ " అన్నాడు గుక్కతిప్పుకోకుండా.

బాబ్జీ కూడా విన్నాడు ఈ డాన్స్‌లగురించి. కానీ నాటకాలకే ఒప్పుకోని తండ్రి వాళ్ళూ వీటికెలా ఒప్పుకుంటారు?

"ఇంకానయం ఒరే!, మీ నాన్నా, మా నాన్నా విన్నారంటే తాట వలిచేస్తారు" అన్నాడు భయంగా.

"మా నాన్న దేముంది?, ధర్మకర్త అయినా మీ నాన్న మాట ఎప్పుడూ కాదనరు. అందుకే నువ్వే ఎలాగెనా ఈ పనికి పూనుకోవాలిరా!. రేపు మనం మాత్రం కాలేజీలో చెప్పుకోవద్దూ, మనమూ పెట్టించామని" అన్నాడు.

శివుడి మాటలకి మిగతా వారు తాళం వేసి బాబ్జీని ములగచెట్టెక్కించారు, "నీ అంతటి వాడూ, కరణంగారి కొడుకూ తలుచుకోవాలే కానీ ఇదేమైనా పెద్ద పనా?"అంటూ. బాబ్జీ అసలే హనుమంతుడిలాంటివాడు, ఒక్కటే తేడా.. ఆయనకి తనశక్తి తెలియాలంటే ఎవరైనా ఎక్కించాలి, ఇక్కడ ఎవరైన ఎక్కిస్తే లేని శక్తి ఉందనుకోగలడు.

చూడగా చూడగా రికార్డింగ్ డాన్స్‌ల విషయం చాలా అద్భుతంగా కనబడసాగింది, బాబ్జీకీ అతని స్నేహితులకి. తండ్రికేదైనా చెప్పాలంటే అతి దగ్గరి రూటు తల్లే.

ఎప్పుడూ పాడే పాటే.. పాడాడు అమ్మ దగ్గర.. 'నను బ్రోవమనీ చెప్పవే వెంకమ్మతల్లీ' అంటూ.

"చాల్లేరా వెధవ్వేషం.. ఏంకావాలో చెప్పేడవండి" అందావిడ. విషయం చెప్పగానే.. " ఒరే.. నేనీ మాట చెప్తే మీ నాన్న నిన్నూ, నన్నూ కూడా తన్ని తగిలేస్తారు" అంది భయంగా.

"ఏం కావాలిట?" కరణంగారు రానే వచ్చారు.

"అబ్బే పిల్లలంతా సరదా పడుతున్నారని మిమ్మల్నేదో అడగడానికొచ్చాడు" అంది ఆ విడ నీళ్ళు నములుతూ..

"పందిట్లో ప్రోగ్రాములేనా? మళ్ళీ ఏవిట్రా? " అడిగారాయన.

ఆయన కంఠం వింటేనే భయం బాబ్జీ స్నేహితులకి.. ఎప్పుడో పెరట్లోకి జారుకున్నారు. బాబ్జీ మెల్లిగా పిల్లిలా గొణిగాడు రికార్డింగ్ డాన్స్‌లగురించి. వెంటనే ధైర్యంగా అనేసాడు.

"రాముడు మాత్రం సినిమాలో శూర్పణఖ డాన్స్‌లూ అవీ చూడలేదా? మనం చూస్తే తప్పేవిటి? " అని.

కరణంగారు కోపంగా కనుబొమలు ముడి వేసి

"వెధవ తర్కాలు పెట్టకు.. అతితెలివీ నువ్వూనూ, వాడెవడో సినిమా వాడి పైత్యం అది.. శూర్పణక ఆడిందీ, పాడిందీ అనీ నేను నమ్మను." అన్నారు

ఈలోపున వెంకమ్మగారు వచ్చి "పోనీ ఓసారికి ఒప్పుకోరాదుటండీ, పిల్లలు సరదా పడుతున్నారు కదా" అని గబగబా వంటింట్లోకి వెళ్ళిపోయింది ఆయనకి కాఫీ కలపడానికి.

ఆయన అవునూ, కాదూ ఏమీ అనకుండా నూతిపళ్ళెంవైపుకి నడిచారు కాళ్ళు కడుగుకోవడానికి.

రాత్రి వెంకమ్మగారు బాబ్జీతో చెప్పింది " ఓసారి వాళ్ళని పిలవమన్నారు.. నాన్నా వాళ్ళూ మాట్లాడతారుట". అంది..

ఇంకేం ఆఘమేఘాలమీద బాబ్జీ, శివుడూ వెళ్ళి వీరాస్వామిని పిలుచుకొచ్చేసారు. వాళ్ళతో మాట్లాడటమూ, డాన్స్ ట్రూపు ఊరిలో దిగడమూ జరిగిపోయింది.

ఎలాంటి పాటలు చూపించాలో అవన్నీ వీరాస్వామికి ముందే చెప్పేసారు. వీరాస్వామి ట్రూప్ అంటే చుట్టుపక్కల ఊర్లలో చాలా గౌరవం, పేరు.. చక్కటి  పాటలకి మాత్రమే అభినయిస్తారనీ, చాలా ఖచ్చితమైన మనిషనీ. పూర్వం చక్కటి నాటకాలు వేసి ఆదరణ తగ్గిపోయాకా ఈ దారి పట్టాడు.. అయినా ఎప్పుడూ హుందాగానూ, అందరికీ నచ్చేవిగానూ ఉండే పాటలూ, పద్యాలూ ప్రదర్శిస్తాడు.

రాత్రి ప్రోగ్రామనగా పొద్దున్నే దిగారు వాళ్ళు ఊరిలోకి. అచ్చు ఎన్.టీ.ఆర్ లాగా బలంగా ఒడ్డూ, పొడుగూ ఉన్న ఒకతనూ, సన్నగా, నాజూగ్గా నాగేశ్వరరావులాంటి ఒకతనూ, కాంతారావులా ఒకతనూ, చిత్తూరు  నాగయ్యగారి లాంటి వీరాస్వామీ, వకుళమాలికలా ఉన్న వీరాస్వామి భార్య సీతాయమ్మా, ఎస్.వీ.రంగారావులా దర్పంగా ఉన్న మరొకతనూ, ఇలా చాలా మంది దిగారు. అలాగే చూడ చక్కని చిన్నది నాగదేవి, హీరోయిన్.  గుడి పక్కన ఉన్న మండపంలో వీళ్ళు మేకప్ సామానులూ అవీ పెట్టుకుని మొఖాలకి రంగులేసుకోవడం మొదలు పెట్టారు.

"ఏం బ్రదర్! ముందు మీదా? మాదా పాట?"  అని అచ్చు రామారావులాగే అడుగుతున్న జూనియర్ రామారావుని అందరూ వింతగా చూసారు. కొద్దిగా పెద్దవాడైనప్పటినించీ తనలాగా తక్కువగానూ రామారావులా ఎక్కువగానూ జీవిస్తున్న వాడు అతను. అందుకే ఆ మహానటుడు  అణువణువునా  పరకాయ ప్రవేశం చేసినట్టే ఉంటాడు అతను వాచకంలో కానీ, అభినయంలోకానీ. అలాగే మిగతావారూనూ.. పక్కనే జూ. ఏ.ఎన్.ఆర్ స్టెప్పులు వేసి చూసుకుంటున్నాడు.

"అచ్చం నాగేశ్వరరావులాగే ఉన్నాడు కదరా! " అన్నాడు శివుడు వాళ్ళందరికీ టీలు తెచ్చి..

సాయంత్రం ఎప్పుడవుతుందా? చీకటి ఎప్పుడు పడుతుందా? అని పిల్లలందరూ ఎదురు చూసారు. అనగా అనగా పడింది చీకటి. మండపం చుట్టూ ఏవో చమికీ తెరల్లాంటివి కట్టారు. మెరుపుల దండలు వేళ్ళాడదీసారు.

ముందు వీరాస్వామి నాగయ్యగారి తరహాలో 'శ్రీ రఘురాం, జయ రఘురాం' పాట పాడాడు. చాలా బావుంది అని అందరూ సంతోషించారు. తరవాత సీతాయమ్మ 'జననీ శివకామినీ' పాటకి అభినయించింది.

తరవాత ఎస్వీ రంగారావులాంటి ఆయన మాయాబజార్  లోని పద్యాలు పాడాడు. సొంత గొంతుకతో ఆయన ' మాధవపెద్ది సత్యంగారిలా పద్యాలు పాడుతుంటే చక్రంలోంచి, రంగు రంగుల రకరకాల లైట్ల వెలుగులో నిజంగా ఘటోత్కచుడు వచ్చినట్టే అనిపించింది అందరికీ.

కరతాళ ధ్వనుల మధ్య అతను తప్పుకున్నాకా స్టేజీ మీద తటిల్లతలా మెరిసింది నాగదేవి.. క్రిష్ణార్జున యుద్ధంలో పాట ఏ.ఎన్.ఆర్ తోటీ, తరవాత నన్ను దోచుకుందువటే పాట ఎన్.టీ.ఆర్ తోటీ మధురంగా నర్తించింది. జూ ఏ.ఎన్.ఆర్, జూ ఎన్.టీ.ఆర్ ఐతే చెప్పనక్కర్లేదు.. తరవాత ప్రతీ రాత్రి వసంత రాత్రి పాట.. ఇలా అద్భుతంగా సాగింది మొత్తానికి..

ఆఖరున నాగదేవి ఒంటరి నృత్యం. 'ఆడేనోయీ నాగకన్యాకా.. ' ఆమె ఆడుతూ ఆడుతూ మండపం చివరికి వచ్చేసింది. కింద పడిపోతుందేమో నని భయంతో ఆపడానికి ఒక్క ఉదుటున లేవబోయి కింద పడ్డాడు బాబ్జీ ..

వీధివాకిలి కడగడానికి వచ్చిన వెంకమ్మగారు సావిట్లో వినిపించిన 'ధబ్' మన్న శబ్దానికి వచ్చి, మంచమ్మీదనించి కింద పడిన కొడుకుని చూసి కంగారు పడి,  మెల్లిగా తట్టి లేపింది.

"ఒరే, బాబీ, ఏమిట్రా ఇలా పడిపోయావు? లే" అంటూ..

"నేను కాదే అమ్మా, నాగదేవి పడిపోయింది" అన్నాడు

"నాగదేవెవర్రా?" అయోమయంగా అంది ఆవిడ.

అప్పటికి కాస్త తెలివి తెచ్చుకున్న బాబ్జీ

"ఇదేవిటమ్మా నేనిక్కడున్నాను? " అన్నాడు.

"చాలాబావుందిరా చోద్యం.. నువ్వు మనింట్లోకాక ఇంకెక్కడుంటావు? రాత్రి బానే పడుకున్నావు కదా, ఇంతలో ఈ తిక్కవాగుడేవిటీ, మంచమ్మీదనించీ కింద పడటమేమిటీ ?" అంది కంగారు పడాల్సినదేమీ లేదని అర్థం అయ్యాకా.

"రాత్రి నేనిక్కడ పడుకున్నానా? పందిట్లోకి వెళ్ళలేదూ? " అన్నాడు అపనమ్మకంగా. "రాత్రి భజనే కదా, ఎనిమిదింటికల్లా అయిపోయిందికదా ! హారతి అందరికీ చూపించే కదరా నువ్వింటికి వచ్చిందీ "అంది..

"రాత్రి డాన్స్ జరగలేదూ, వీరాస్వామీ వాళ్ళూ రాలేదూ"? కొంత స్వగతంలోనూ, కొంత ప్రకాశంగానూ అన్నాడు.

"వీరాస్వామెవరూ? డాన్సేమిటీ? నీకేమైనా కలొచ్చిందేమో? అసలు మీ నాన్న ఇప్పటి వరకూ 'ఊ' అనందే. సర్లే, లేచి మంచం ఎత్తి పెట్టు. వాకిలి కడిగి కాఫీ ఇస్తా" అందావిడ వీధిలోకి నడుస్తూ..

"జూ ఎన్.టీ.ఆరూ, కాంతారావూ, నాగేశ్వరరావూ చివరికి నాగదేవీ అంతా కలేనా? అంతనిజంగా ఎలా అనిపించిందీ? శివగాడు వర్ణించినందుకా? అసలు నాన్న ఒప్పుకోనే లేదన్నమాట, అంటే అమ్మ ఒప్పుకున్నారని చెప్పిందీ కలేనా? " ఉస్సురంటూ నిట్టూర్చాడు బాబ్జీ. "ఇంక ఈసారికి ఈ కలలో చూసినదే డాన్స్" అనుకున్నాడు విసుగ్గా.

అగ్రహారం పెద్దలా మాటలా, నాగదేవే కాదు సాక్షాత్తూ విప్రనారాయణుడి దేవదేవి డాన్సులైనా సరే కలల్లోనే.. అగ్రహారంలో రికార్డింగ్ డాన్సులే, ఇంకా నయం.!!అంతకన్నా హనుమంతుడిముందు కుప్పిగంతులు తేలిక కదూ!

